
# విముక్తి




— మురళీకృష్ణ

వాయిదాలమీద ట్రాన్సిస్టర్



స్టాండర్డ్


(గ్యారంటీతో)

3 బాండ్ల, అతిలావవంత పోర్టబుల్ ట్రాన్సిస్టర్ రు. 5/-ల నెలసరి వాయిదాలమీద ప్రతి వారికి, ఉచితంగా పంపబడును వ్రాయండి.

AMBA AGENCIES (52)
Model Town, Delhi-9.



చిత్రకళను తెలుగు భాషలోనే నేర్చుకొనండి



స్థాపితం: 1957 ఫోన్ నెం: 82796

మా విద్యార్థిని కుమారి K. ఇందిరా కల్యాణి, B Sc., C/o. K. శివరావుగారు. P.B. No. 1 తెనాలి ఇలా వ్రాయుచున్నారు: స్కూలులో చేరి నేర్చుకొను అవకాశం లేని వారికి ఇది ఒక అపూర్వ సహాయము. ఈ పాఠముల శ్రేష్ఠమైన పద్ధతులవల్ల తపాలామూలముగా శిక్షణ పొంది చక్కని చిత్రకారులు కాగలరు. ఇది నా అనుభవపూర్వకమైన నమ్మకము.

మీరుకూడా ఇలాటి శ్రేష్ఠమైన చిత్రకళను నేర్చుకోగోరెదరా? తెలుగు, తమిళం, మళయాళం, ఇంగ్లీషులలో నేర్చుకోవచ్చును. వివరములకు 50. పై. స్టాంపులు పంపండి.

SANTHANU'S CHITIRA VIDYALAYAM,
C/o. Chitirakullan, Madras-2.








నమస్కారం చేసి, రిక్షావాని ముందుకు సాగిపోయాడు కరుణాకరం.

కరుణాకరం వెళ్ళినవైపు ఓ నిమిషం చూసి, మళ్లీ నడక సాగించాడు జానకిరామయ్య. అలవాటయిన రోడ్లు కాబట్టి కాళ్లు వాటంతట అవే దాక్కుపోతున్నాయి. జానకిరామయ్య మళ్లీ ఆలోచనలో పడ్డాడు.

వారాలు చేసుకుని, ఎక్కడా భోజనం దొరకని వాడు తమ ఇంట భోంచేస్తూ, తమ ఇంట్లోనే ముందు గదిలో ఉండి, ఇంట్లో ఒకడుగా మెలుగుతూ తన ఆదరాభిమానాలతో చదువుకున్న కరుణాకరం ఎంతటివాడయ్యాడు? అతడి జాతకం అలా ఉంది! మొదట కష్టపడినా, ఇప్పుడు సుఖపడుతున్నాడు తనలా కాకుండా. తాను సర్వీసులో ఉన్నప్పుడు స్థితి మరో విధంగా ఉండేది. తాము తింటూ ఒకరికి పెట్టగలిగేవారు ఆ నాడు. రిటైరయ్యేనాటికి మిగిలిందేమీ లేదు, "జానకిరామయ్య మంచివాడు" అన్న పేరు తప్ప! కానీ ఈ రోజు ఆ మంచి పేరు భోజనం పెట్టడం లేదు. ఇంజనీరింగ్ చదివిద్దామనుకున్న పెద్దబ్బాయి నారాయణని ఇంజనీరింగ్ ఆఫీసులో గుమాస్తాగా చేర్పించాడు చివరకు. పెద్దమ్మాయి పెళ్లికిగాను చేసిన అప్పులు తీర్చడానికి పాతబడినా, కోరికలు పాతబడని పెద్దల్లుడి అభీష్టాలు తీర్చడానికి, రెండో అమ్మాయి పెళ్లిలో కట్నాలు కానుకలు—వీటన్నింటికీ తోడు నెలలో మూడు వారాలు మంచమెక్కే ఇల్లాలి మందు ఖర్చులకు అన్నిటికీ ఉన్న ఆస్తి అమ్మవలసిరావడం తప్పనిసరి అయింది. ఇప్పుడు నారాయణ జీతమొక్కటే ఆధారం. తను చెప్పే ట్యూషన్లు ఏదో నీళ్లల్లకు చన్నీళ్లు తోడుగా నడుస్తోంది సంసారం!. . .'

ఉన్నట్టుండి ఆయన మనసులోని ఆలోచనలమధ్య మళ్లీ కరుణాకరం మెదిలాడు. . . 'తనపట్ల ఎంతో గౌరవం, కృతజ్ఞత కలిగినవాడు కరుణాకరం. అతడిని సహాయం అడిగితే?' అన్న మెరుపు మెరిసింది ఆయన మనోగగనంలో! కానీ ఇంతలోనే 'ఛీ! ఛీ! బాపుండదు. జీవితంలో ఒకరిని చేయిచాచి ఎరగడు తాను. డబ్బు లేకపోయినా, ఉన్న ఆత్మాభిమానం పోగొట్టుకోవడం ఎందుకు?' అనిపించింది. మళ్లీ కొన్ని క్షణాలకు తనే సమాధానం చెప్పుకున్నాడు. 'అతడు పరాయివాడా? తన బిడ్డలాంటివాడు. పైగా, తన ఆదరంతో వృద్ధిలోకి వచ్చాడన్న కృతజ్ఞతాభావం అతడిలో ఉంది కదా! అడిగి చూస్తే సరి. . . కాదంటాడా?' అని సరిపెట్టుకున్నాడు. మనస్సుకు కాస్త ఊరట కలిగేసరికి, ఆయనలో కొంత బలం వచ్చినట్లయింది. అడుగులు త్వరత్వరగా పడ్డాయి. ఆలోచిస్తూనే ఇంటివైపు నడవసాగాడు. . .

"నాన్నా!" అన్న పిలుపుతో ఉలిక్కిపడి చూశాడు జానకిరామయ్యవంతులు.

ఇంటి గుమ్మం ముందు నిలుచున్నఅయిదేళ్ల కూతురు కేక వేసింది. అప్పటికిగానీ గుర్తించలేదుజానకిరామయ్య, తను పరధ్యానంలో పడి ఇల్లు దాటి నడుస్తున్నట్లు.

చిన్నగా నవ్వుకుంటూ ఇంటి మెట్లెక్కాడు. లోపలికి వచ్చి, చివరగా ఉన్న తమ వాటాలోకి వెళ్లబోతూ యథాలాపంగా ఇంటివారి వరండావైపు చూశాడు జానకిరామయ్య.

మామూలుప్రకారం ఇంటివారి పెద్దబ్బాయి వరండాలో స్తంభానికి పక్కగా కూర్చుని ఉన్నాడు. అతడు మతి స్థిమితంలేని మనిషి. కాలికి గొలుసు వేసి, స్తంభానికి కట్టేసి ఉంచుతారు. సుమారు ముప్పై అయిదేళ్లుంటాయి అతడికి. వేళకు అతడిని తీసుకు వెళ్లి స్నానం చేయించి, భోజనం పెట్టి మళ్లీ తీసుకు వచ్చి వరండాలో స్తంభం పక్కన కూర్చోబెట్టి, గొలుసుతో కాలికి బంధం వేస్తారు. తనలో తాను ఏదో చెప్పుకుంటూ, నవ్వుకుంటూ ఉంటాడు. వచ్చి పోయేవారిని వని ఉన్నట్టుగా పిలుస్తూ ఉంటాడు.

అతడిని చూస్తే జానకిరామయ్యకు అప్పుడప్పుడూ అసూయ కలుగుతూ ఉంటుంది! ఇబ్బందులు లేవు, బాధ్యతలు లేవు, కష్టాలు లేవు. . . అతణ్ణి పిచ్చివాడంటారు. అంటే ఏం? అతడి సామ్రాజ్యానికి అతడు మకుటంలేని మహారాజు! జ్ఞానం ఉండి ఇబ్బందుల బ్రతుకు బ్రతికేకన్నా, ఏ జ్ఞానమూ లేని ఆ బ్రతుకే మేలని జానకిరామయ్యకు అప్పుడప్పుడూ అనిపిస్తుంటుంది. లోపలికి వెళ్లబోతున్న జానకిరామయ్యను పిలిచా డతడు తీవ్రంగా! 'వస్తానన్నట్లు చేతో సైగ చేసి, తమ వాటాలోకి అడుగు పెట్టాడు జానకిరామయ్య.

పెంకులో నిప్పులు పోసి, ఉతికిన బట్టలు ఇస్త్రీ చేస్తున్న రాంబాబు తండ్రిని చూడగానే చేతిలోని నిప్పులపెంకు నేలమీద పెట్టి ఆత్రతతో లేచి వచ్చాడు.

"పెన్సిలు ఇచ్చారా, నాన్నా?" అడిగాడు రాంబాబు, 'రేపు నేను ఇంటర్వ్యూకి వెళ్లగలను కదా!' అన్నట్లు ఆశగా తండ్రి కళ్లలోకి చూస్తూ.

లేదని కళ్లతోనే జవాబు చెప్పి, మౌనంగా వంటింటి గుమ్మంవద్దకు నడిచాడు.

"ఇంక అడగను. . . అడగను. . . కొట్టద్దు" అని కేకలు పెడుతూ ఏడుస్తున్న చిన్నవాడిని వినవక్రకాడతో కొడుతూంది పార్వతమ్మ.

"కొట్టకు, పార్వతీ! . . ఏం జరిగింది?" అన్నాడు జానకిరామయ్య మెల్లిగా.

"వచ్చారా? చూడండి! ఎప్పుడో నాలుగు రోజుల నాడు ఎదురింటి మూర్తిగారింట్లో ఇచ్చిన బిస్కట్లు దాచి, అప్పుడప్పుడూ చంటిది పాల కేడ్చినప్పుడు ఓ ముక్క పడేస్తున్నాను. అవన్నీ తన కిచ్చేయమని పీడి ఏడుపు" అంటూ వాడి వీపుమీద మరొకటి తగిలించింది.

అమ్మను వదుల్చుకుని, గబగబా పరిగెత్తుకు వచ్చి తండ్రి కాళ్లను చుట్టుకున్నాడు చిన్నవాడు.

"బిస్కట్లు అడగను, నాన్నా! అమ్మను కొట్టొద్దని చెప్పు, నాన్నా!" అని దీనంగా జానకిరామయ్యవైపు చూశాడు వాడు, కొట్టినచోట తడుముకుంటూ.

వాడిని దగ్గరకు తీసుకుని బుజ్జగించాడు.

"ఏమండీ! డబ్బు తెచ్చారా?" అంది పార్వతమ్మ దగ్గరికి వస్తూ.

జరిగింది చెప్పాడు జానకిరామయ్య భార్యకు. గట్టిగా నిట్టూర్చి, మళ్లీ లోపలికి వెళ్లింది పార్వతమ్మ.

"ఒంట్లో బాగులేనిదానివి. నీవు లేచివచ్చావేం వంటపనికి?" అన్నాడు మెల్లిగా.

"కోడలు దొరసానిగారు ఈ వేళ గది దాటలేదు. ఏమొచ్చిందో ఏమో? బాగున్నా లేకపోయినా నాకు తప్పుతుందా? మీరు రండి, భోజనంచేద్దురు గాని" అంది నీరసంగా.

ఇంతలో "నాన్నా! నాన్నా!" అంటూ పెరట్లోనుంచి

సిగ్గెత్తుకు వచ్చింది పన్నెండేళ్ల మూడో అమ్మాయి వసంత.

"రేపు స్కూల్లో స్పెషల్‌ఫీజు కట్టకపోతే పేరు కొట్టేస్తారుట. ఎనిమిది రూపాయలు కావాలి, నాన్నా!" అంది.

జానకిరామయ్య ఒక్క క్షణం చుట్టూ చూశాడు. చేస్తున్న ఇస్త్రీపని ఆపి, 'డబ్బు తేలేదే?' అన్నట్లు తనవంక చూస్తున్న రాంబాబు, 'ఒక్క బిస్కట్ ముక్క కొనిపెట్టలేవా, నాన్నా?' అన్నట్లు ఏడుస్తూ చూస్తున్న చిన్నవాడు, 'మీరు ఈవేళ డబ్బులు తేలేకపోతే ఇల్లు గడిచేదెలా?' అన్నట్లు చూస్తున్న అర్ధాంగిని 'స్కూల్లో ఫీజు కట్టడానికి రేపే చివరిరోజు' అని చూస్తున్న వసంత. . . ఇంటినిండా అవసరాలు, తను తెచ్చే డబ్బు కోసం ఎదురుచూసే మనుషులు, వీథిలోకి వెళితే తాను ఇవ్వవలసిన వాళ్ళ డబ్బు కోసం చూసే చూపులు. . .

జానకిరామయ్యలో అప్పటివరకున్న సహనం నశించింది. క్షణకాలం మనసు వికావికలైంది.

"నన్ను చంపి, తలా కొంచెం పంచుకోండి, తల్లీ!" అన్నాడు చాలా విసుగ్గా.

"అవతలికి పోవే, పాడుముండా! ఇప్పుడే చెప్పాలావు. భోజనం అయ్యాక చెప్పకూడదూ" అని కూతురిని కసిరి పంపించింది పార్వతమ్మ.

"మీరు కాళ్ళు కడుక్కు రండి, నాలుగు మెతుకులు తిందురుగాని" అంది భర్తకేసి చూస్తూ.

మెల్లిగా వంటింట్లోకి నడిచాడు జానకిరామయ్య. భోజనం చేస్తూ కరుణాకరం కనిపించిన విషయం, సాయంత్రం అతడింటికి వస్తాడన్న విషయం చెప్పాడు. కరుణాకరం స్థితి విని, చాలా సంతోషపడింది పార్వతమ్మ. ఎలాగైనా అతడిని సహాయం అడగమని భర్తను ప్రోత్సహించింది.

భోజనం అయిందనిపించి, ముందు పడవలోకి వచ్చి కుక్కిమంచంపై కాస్త నడుం వాల్చాడు జానకిరామయ్య.

పక్కగదిలోనుండి వినవస్తున్న సంభాషణ అప్రయత్నంగానే ఆయన చెవుల పడింది. నారాయణ, కోడలు కమల ఏదో మాట్లాడుకుంటున్నారు. స్పష్టంగా వినపడలేదు కాని వాళ్ళేదో తీవ్రంగా వాదించుకున్నట్లనిపించింది. ఉన్నట్టుండి కోడలి జవాబు పెద్దగా వినిపించింది.

"అవును! మీ రిలాగే అనుకుంటూ ఉండండి ఎంతకూ మన ఇల్లు, అమ్మ, నాన్న, చెల్లెళ్ళు, తమ్ముళ్ళు అనుకుంటూ ఉంటే చివరకు మన బిడ్డల సంగతి ఏమౌతుంది? వాళ్ళూ మీ లాగే బతకాలి!"

నారాయణ ఏదో సర్ది చెబుతున్నాడు. వినిపించలేదు జానకిరామయ్యకు.

'తనాడు మధ్యతరగతికి చెందిన ఏ ఇంటి సంసారంలోని ఏ కోడలైనా ఎలా అనుకుంటుందో, సరిగ్గా కమలకూడా అలాగే అంది!. . . అంతే! నారాయణకూడా పెళ్ళికి ముందున్న తీరుకి, ఇప్పటికి ఎంతో తేడా! పెళ్ళయ్యాక ఇంట్లో కొడుకులు, కోడళ్ళు పేయింగ్ గెస్ట్లలాగ ఫీలవుతారు. . .' అని ఏదో ఆలోచిస్తూ, మగతనిద్రలోకి జారుకున్నాడు జానకిరామయ్య.

* * *

సాయంత్రం ఆరు గంట లయింది.

ఇంట్లోకి, వీథిలోకి అదుర్దాగా చూస్తూ, నాలుగు సార్లు తిరిగి సగం విరిగిన కుర్చీలో కూర్చున్నాడు జానకిరామయ్య.


"వెళ్ళిపోయాడేమో?" అంది పక్కగా మంచంమీద పడుకున్న పార్వతమ్మ.

"లేదు, లేదు. తప్పకుండా వస్తాడు. కరుణాకరం మాట తప్పే మనిషి కాదు" అన్నాడు.

ఇంతలో బయట మోటార్‌సైకిల్ చప్పుడయింది.

"నారాయణ,రాంబాబు లేరా,ఎక్కడున్నారూ?" అన్నాడు కరుణాకరం, కుర్చీలో కూర్చుని ఇంటిని నలువైపులా చూస్తూ. ఇంటిస్థితి చూసి, జానకిరామయ్యపంతులు ఎలా జీవితం గడుపుతున్నాడో అర్థం చేసుకున్న కరుణాకరం బాధపడ్డాడు.

"లేరు, బాబూ! నారాయణ ఇంకా ఆఫీసునుండి రాలేదు. రాంబాబు ఎక్కడికో వెళ్ళాడు." అంది పార్వతమ్మ కరుణాకరాన్ని తదేకంగా చూచి.



ఆలయం ఫోటో—పి. వెంకటరెడ్డి (ఎమ్. లింగాపురం)

లేచి వీథిలోకి వచ్చి, కరుణాకరాన్ని వెంటబెట్టుకుని లోపలికి తీసుకువచ్చాడు.

లోనికి రాగానే చేతిలోని పండ్లు పార్వతమ్మ చేతి కిచ్చి, వంగి నమస్కరించాడు కరుణాకరం.

"బాగున్నావా, నాయనా?" అని ఆప్యాయంగా పలకరించింది ఆవిడ.

"మీ దయవల్ల ఇలా ఉన్నాను. . . పిల్లలందరూ బాగున్నారామ్మా?"

"కూర్చో, కరుణాకరం!" అంటూ గోడపక్కగా కుర్చీ వేశాడు జానకిరామయ్య.

కుశలప్రశ్నలు, యోగక్షేమాలు అయ్యాక ఏం మాట్లాడుకోవాలో తోచనట్లు మౌనంగా ఉండి పోయారు అందరూ.

"పెళ్ళయిందా, కరుణాకరం?" అంది పార్వతమ్మ ప్రేమ సహజంగా.

సిగ్గుపడుతూ లేదని తల ఊపాడు.

కరుణాకరం చూడకుండా అప్పుడప్పుడు భర్తవైపు చూసి కళ్ళతో సైగలు చేసింది పార్వతమ్మ, అతడిని సహాయం అడగమని.

కొంతసేపు మనసులో మథనపడి చివరకు జానకి

తన పెన్షన్ విషయం, నారాయణ తీరు, ఇల్లు నడుస్తున్న వైనం అన్నీ వివరించాడు.

విని చాలా నొచ్చుకున్నాడు కరుణాకరం.

పర్సులోనుండి ఓ వందరూపాయల కాగితం తీసి బల్లమీద పెడుతూ, "రాంబాబును రేపు ఇంటర్వ్యూకి పంపండి, మాస్టారూ! అక్కడ రాకపోతే, మరోచోట ఎక్కడైనా ప్రయత్నిద్దాం!" అన్నాడు కరుణాకరం.

ఆ డబ్బు తీసుకోవటానికి తటపటాయించాడు జానకిరామయ్య.

"తీసుకోండి, మాస్టారూ! నేను మీ బిడ్డలాంటి వాడిని. నా దగ్గిర తీసుకోవడానికి సందేహిస్తారెందుకూ?" కరుణాకరం బలవంతం చేశాడు.

"అత డంతగా చెపుతూంటే..." సగంలో ఆపింది పార్వతమ్మ, 'తీసుకోండి' అన్న చూపులో.

బల్లమీది కాగితం అందుకున్నాడు జానకిరామయ్య.


తను కూర్చున్న కుర్చీకెదురుగా గది గుమ్మంవద్ద గాజుల చప్పు డయ్యేసరికి కరుణాకరం దృష్టి అటు మళ్ళింది. . . తెల్లని చీరె, అంతకంటే తెల్లటి చోళీ, రెండు చేతుల నిండుకూ పచ్చని గాజులు, కాళ్లకు పసుపు- లేతబంగారుఛాయతో మెరిసిపోతున్న ముఖంలో నుదుటిమీద ఎర్రని కుంకుమబొట్టు, ఎదటివాడి నిట్టే ఆకట్టుకోగలిగే పెద్ద కళ్ళకు కాటుక, వాలుజడలో నిండుగా తురిమిన మల్లెపూలు — సుమారు ఇరవయ్యేళ్ల పడుచు అందంగా, ఆకర్షణీయంగా కనిపించింది. కరుణాకరం చూపు మరల్చుకోలేక అలాగే చూశాడు. సన్నగా చిరునవ్వు నవ్వి మరుక్షణంలో విద్యుల్లతలా మాయమైంది ఆ యువతి.


## వధువు కావలెను

సైన్సు గ్రాడ్యుయేటు, రు. 60 సంపాదిస్తున్న 28 సం.ల వయస్సుగల ఆంధ్ర వైదిక బ్రాహ్మణ (హరితసగోత్రం) యువకునకు రూపవతి, విద్యావతియైన వధువు కావలెను. వివాహము శీఘ్రముగ జరుప సంకల్పము. ఉపశాఖలైన అభ్యంతరము లేదు. కన్యలు/తల్లిదండ్రులు పూర్తి వివరములతో వ్రాయండి. బాక్సు నం 111, C/o ఆంధ్రప్రభ వీక్లి, మద్రాసు-2.

## ఏజంట్లు కావలెను

(రు 1000/- లు సంపాదించండి)



స్టాండర్డ్ అను ప్రపంచ ట్రాన్సిస్టర్లకు, ఇండియన్ ఆర్టు చీరెలకు జీతం మరియు కమిషనుమీద ఆర్డర్లు బుక్ చేయుటకు ఏజంట్లు కావలెను. ఉచిత షరతులకు కొంపిలుక వ్రాయండి.

BHARAT AGENCIES, (60)
Kolhapur Road, Delhi-7


ఆవిడ వెళ్లిపోయాక కూడా ఆ వేపే చూస్తూ, "రెండో అమ్మాయి మీనాక్షి కదండీ?" అని అడిగాడు కరుణాకరం.

జవాబు చెప్పేలోగానే, గదిలోనుండి పెద్దగా ఏడుపు వినిపించింది. మరునిమిషంలోనే పెద్దగా నవ్వు, మళ్లీ ఇంతలోనే ఏడుపు. . .

మంచంమీదనుండి గబగబా లేచి గదిలోకి వెళ్లింది పార్వతమ్మ. కరుణాకరం ఆశ్చర్యపోయి, వింతగా అలాగే చూశాడు.

గదిలోనుండి మళ్లీ ఏడుపు, ఎక్కిళ్ళు, "ఊరుకో, ఊరుకో!" అన్న సముదాయింపు వినపడ్డాయి. మరి కొంతసేపటికి గది లోపలివైపుకు మనిషిని బలవంతంగా లాగుతున్న చప్పుడు, వెంటనే గదికి అటువైపు తలుపు వేసి గొళ్లెం పెట్టిన శబ్దమూ వినిపించాయి.

"ఏమిటి, మాస్టారూ! ఏం జరిగింది?" ఆత్రంగా అడిగాడు కరుణాకరం.

జానకిరామయ్య జవాబు చెప్పలేదు. కుడిచేతి బొటనవేలు నుదుటిమీద అడ్డంగా గీచి 'ఖర్మ' అన్నట్లు చూపాడు. తనలో తాను అస్పష్టంగా ఏదో గొణుక్కున్నాడు. కరుణాకరానికి సరిగా తెలియలేదు.

మాస్టారి ముఖం చూచి మరేమీ అడగలేకపోయాడు.

కొన్ని నిమిషాలు నిశ్శబ్దంగా గడిచాయి.

పార్వతమ్మ లోపలినుండి వచ్చి చికాకుగా మంచం మీద కూర్చుంది.

ఆ తరవాత ఎక్కువసేపు ఉండలేకపోయాడు కరుణాకరం.

ఏదో ఇబ్బందిగా బాధపడ్డాడు ... లేచి నిలుచున్నాడు.

"వెళ్ళొస్తానండీ! ఇంకా కొంచెం పని ఉంది. అది పూర్తిచేసుకుని రాత్రికి తిరిగి బందరు వెళ్లిపోవాలి" అన్నాడు.

"మంచిది, కరుణాకరం! ఈ ఊరికి వచ్చినప్పుడు ఇంటికి వస్తూండు" అన్నాడు జానకిరామయ్య, తనూ లేచి.

"తప్పక వస్తూంటానుమాస్టారూ! ఎప్పుడేసహాయం కావలిసి వచ్చినా, ఉత్తరం వ్రాయండి. నన్ను పరాయివాడుగా చూడవద్దు . . . వెళ్లొస్తానమ్మా" అని సెలవు తీసుకుని వీథిలోకి వచ్చాడు కరుణాకరం.

వేగంగా వెళ్ళిపోతున్న మోటార్ సైకిల్‌ను చూస్తూ వీథిమెట్లమీద నిలుచుండిపోయాడు జానకిరామయ్య పంతులు.

కాలెండరులో ఒక కాగితం చిరిగిపోయింది.

ఒక రోజు ఉదయం పోస్టులో జానకిరామయ్యకు ఓ కవరు వచ్చింది. దానిమీది దస్తూరీ చూచి, ఎవరిదా అనుకుంటూ కవరు చించి ఉత్తరం తీశాడు. . .

"పూజ్యులైన మాస్టారుగారికి!

కరుణాకరం నమస్సులు!

మీ ఆశీర్వాదంవల్ల క్షేమంగా ఉన్నాను. మీ రందరూ కులాసాగా ఉన్నారని తలుస్తాను.

గత నెలలో మిమ్మల్ని చూచి వచ్చినప్పటినుండి, మీ గురించి అహరహమూ ఆలోచించాను— 'ఒకప్పుడు నా చదువుకు సహాయం చేసి, నన్నో మనిషిని చేసిన మీకు ఇప్పటి స్థితిలో ఎలాంటి ప్రతిసహాయం చేసి నా కృతజ్ఞత వెల్లడించుకోవడమా?' అని! ఆ నాటి మీ ఉపకారానికి ప్రతిక్రృతి ఒక్కనాటితో తీరేది కాదు. ఏ రామయ్య రాంబాబు ఇంటర్వ్యూకు వెళ్లవలిసిన సంగతి, విధమైన సహాయం చేసినా, మీ ఋణం తీరదు . . . ఏదో ఆవేశంలో వ్రాయడంకాక స్థిమితంగా ఆలోచించి, మీ కొక్క విషయం వ్రాస్తున్నాను. మీరు నిశితంగా యోచించి మీ అభిప్రాయం తెలియజేయండి.

మీనాక్షిని నేను పెళ్లి చేసుకుంటాను, మాస్టారూ! అలా మీలో ఒకడుగా కలిసిపోయి మీ కుటుంబానికి చేయగలిగినదల్లా చేస్తాను. హాయిగా విశ్రాంతి తీసుకోవలిసిన ఈ వయసులో బాధలు పడుతూన్న మీకు కొంతవరకు విముక్తి కలిగిస్తాను.

నాకు ఇక్కడినుండి తిరుపతికి బదిలీ అయింది. ఈ రోజో, రేపో రిలీవ్ అవుతున్నాను. మరో వారం రోజులకు ఇక్కడినుండి వెళ్లిపోతున్నాను. సరిగ్గా ఈ వారం నాటికి మీ జవాబు రాకపోతే, నా ప్రతిపాదనకు మీ కంగీకారం లేదనుకుంటాను. . . అలా కాకపోయినా, మీ కే నాడు ఏ సహాయం కావలిసివచ్చినా నే నున్నానని మరిచిపోకండి.

మీ జవాబు ఆశిస్తూ,

భవదీయుడు,

—కరుణాకరం."

ఉత్తరం చదవడం పూర్తిచేసిన జానకిరామయ్య కళ్లు చెమ్మగిల్లాయి. కళ్ల ఎదట కరుణాకరం నిలిచి అడుగుతున్నట్లుగానే అనిపించింది. కొన్ని క్షణాలు ఆయన మనసు సంతోషంతో నిండిపోయింది. ఎప్పుడో తాను చేసిన కొద్ది సహాయానికి, ఇంతగా ఉపకృతి చేసే శిష్యుణ్ణి తలుచుకుని మురిసిపోయాడు. కన్నబిడ్డ కంటే ఎక్కువగా బరువు, బాధ్యతలు పంచుకుంటాననే కరుణాకరాన్ని ఎలా మెచ్చుకోవాలో తోచలేదు. ఉత్తరాన్ని మళ్లీ మళ్లీ చదివాడు.

గబగబా లోపలికి నడిచి వంటింటి గుమ్మంముందు నిలుచుని, "పార్వతీ!" అని పిలిచాడు.

చేతిలోని పని వదిలిపెట్టి లేచి వచ్చింది పార్వతమ్మ "ఏమిటండీ?" అని.

"అబ్బే! ఏం లేదు. . . ఏం లేదు!. . . మంచినీళ్ళు కావాలి" అన్నాడు జానకిరామయ్య.

కరుణాకరం వ్రాసిన ఉత్తరం సంగతి భార్యకు చెబుదామని వచ్చినవాడు, ఇంతలోనే ఆ ప్రయత్నం మానుకున్నాడు. క్షణంలోనే ఆయన మనసును ఎన్నో ఆలోచనలు ఉక్కిరిబిక్కిరి చేశాయి.

నీళ్లు తాగి ఇవతలకు వచ్చాడు, ఆవిడ కా సంగతి చెప్పకుండానే. . .

అప్పుడేకాదు, ఆ తరవాతకూడా చెప్పలేదు. రాత్రీ పగలూ ప్రతి క్షణం ఆలోచించాడు, కరుణాకరానికి ఏం జవాబు వ్రాయడమా? అని. ఆతడు చేస్తానన్న సహాయంలోని త్యాగానికి, మంచితనానికి ఒకవైపు మురిసిపోయాడు. కాని అతడి మాటను అంగీకరించలేని తమ స్థితికి క్రుంగిపోయాడు మరోవైపు.

ఇలా ఆరు రోజులు గడిచాయి. ఏడవ రోజు వచ్చింది. కరుణాకరం జవాబు కోసం పెట్టిన గడువులో చివరి రోజు. 'కనీసం ఈ రోజు వ్రాసినా రేపు చేరుతుంది. వ్రాయక తప్పదు' అన్న నిర్ణయానికి వచ్చాడు జానకిరామయ్య.

కాగితం, కలం తీసుకుని ఉత్తరం వ్రాయడం మొదలుపెట్టాడు.

"చిరంజీవి కరుణాకరానికి!

ఆశీస్సులు!

నీ ఉత్తరం చూచి ఎంత సంతోషించానో వ్రాయలేను. నా యందు నీకు గల గౌరవాభిమానాలు, మా కుటుంబంపట్ల నీకుగల ఆప్యాయత గ్రహించి ఆనందంతో పొంగిపోయాను.

కానీ, ఒక్క మాట, కరుణాకరం!

కోరి బంధుత్వం చేసుకుని, సహాయపడతానన్న నీ ఆదరణకు నోచుకోలేదు నేను. కారణం—మీనాక్షి విధవ. ఆశ్చర్యపడకు!. . . పెళ్లయిన మూడో నెలలోనే ప్రమాదానికి గురిఅయి అల్లుడు పోయాడు. ఎంతగానో బాధపడ్డాము. ఇరవయ్యేళ్ల వయస్సులో అరవయ్యేళ్ళ బ్రతుకు గడపలేక మానసికంగా కుమిలిపోయింది మీనాక్షి. ఫలితం— హిస్టీరియా. ఉన్నట్టుండి ఎప్పుడైనా ఓ సారి పసుపుకుంకుమలతో, పూలజడతో విందుగా అలంకరించుకుంటుంది. మరుక్షణంలోనే తన స్థితి గుర్తుతెచ్చుకుని విరుచుకుపడిపోతుంది. ఆ నాడు నీవు మీనాక్షిని చూసింది సరిగ్గా ఇలాంటి స్థితిలో. బహుశా మీనాక్షి రూపం చూసి, ఆవిడ కింకా పెళ్ళికాలేదని అనుకుని ఉంటావు. అందులో నీ పొరబాటేమీ లేదు.

'అయినా ఫరవాలేదు. పునర్వివాహం చేసుకుంటాను' అనవచ్చు నీవు. కానీ, నేను సిద్ధపడలేను. క్షమించు. కరుణాకరం! బాగా డబ్బున్నవాడో, లేక రాజకీయంగా పదిమందిలో గొప్పగా చెలామణి అయ్యేవాడో, తన కూతురికి ఈ స్థితిలో మళ్లీ పెళ్లిచేస్తే, సంఘం 'ఆహా ఓహో!' అంటుంది. అతడి ప్రతిష్ఠ మరింత పెరుగుతుంది. కానీ నా లాంటి మధ్యతరగతి బడిపంతులు విషయంలో మాత్రం కాదు. బ్రతుకులో అన్ని విధాల దెబ్బలు తిన్నవాడిమీద మరో నాలుగు రాళ్ల వేస్తుంది లోకం. మీనాక్షి తరవాత ఇంకా ముగ్గురు ఆడపిల్లలున్నారు నాకు. మనం పుస్తకాల్లో చదువుతున్నంతగా ముందుకు పోలేదింకా మన సంఘం. వేడిరక్తం ఉరకలు వేస్తున్న నీకు తెలియకపోవచ్చు. కానీ అరవయ్యేళ్ల అనుభవాల తాలూకు జీవితసత్యం వ్రాస్తున్నాను నేను.

ఏ గొకమాట.ఇటీవల నారాయణ ఉద్యోగం పోయింది. "మన దేశం ఇంకా చాలా అభివృద్ధికి రావాలి, ముందుకు పోవాలి" అంటూనే, అందుకు కావలిసిన ఇంజనీర్లు మాత్రం అవసరం లేదన్న గొప్ప ఆలోచనతో కాబోలు, ఇటీవల ఒక్కుమ్మడిగా చేసిన రిట్రెంచ్‌మెంట్‌లో నారాయణ పనిచేస్తున్న డివిజన్ ఆఫీసు తీసివేశారు. ఫలితం, ఇల్లు పోషించే నాథుడు లేకపోవడం! ఈ స్థితిలో ఇంట్లో ఉండలేక, భర్తను తీసుకుని పుట్టింటికి వెళ్లిపోయింది కోడలు, అక్కడ ఉద్యోగప్రయత్నం కోసం. వాడు మాత్రం ఏం చేయగలడు, భార్య మాటను శిరసావహించడంతప్ప! అది సహజమే, కరుణాకరం! రెక్కలు వచ్చాక గూటిని నమ్ముకుని ఏ పక్షి ఉంటుంది? మారుతూన్న మన వ్యవస్థలోని ప్రకృతియా అంతే!. . .

రాంబాబు ఇంటర్వ్యూకి వెళ్లివచ్చాడు. అంతకుముందే ఆ ఉద్యోగం ఎవరికో ( అనధికారంగానే ) రిజర్వు చేయబడిందిట.

ఇల్లు గడవడం కోసం మరో నాలుగు ట్యూషన్లు ఎక్కువ చేసుకోవడానికి ప్రయత్నిస్తున్నాను. నా ఆరోగ్యం అంతగా బాగుండడం లేదు. పండిపోయిన ఈ ఆకు ఏ క్షణాన రాలిపోతుందో?. . . అందుకే, ఒక్క మాటలో అర్థిస్తున్నాను, కరుణాకరం! నా తరవాత మా కుటుంబానికి సారథివి నీవే! ఏ రూపంలో ఏ సహాయం చేసినా నీ ఇష్టం!

ఆశీస్సులతో,
—జానకిరామయ్య."

చివరి వాక్యం వ్రాస్తూంటే, కళ్లనీళ్లు జారి టపటపమని ఉత్తరంమీద పడ్డాయి. పైపంచతో కాగితంమీది తడి అద్ది, జాగ్రత్తగా మడిచి చేతిలో పట్టుకొన్నాడు జానకిరామయ్య. కరుణాకరం వ్రాసిన ఉత్తరం విషయం చెప్పనట్లే, తన జవాబుని గురించి కూడా పార్వతమ్మకు చెప్పలేదు. మెట్లు దిగి, వీథిలోకి వచ్చి పోస్టాఫీసువైపు అడుగువేశాడు. ఇరుకుసందులు, మురికివాసన దాటుకుని మెయిన్‌రోడ్డుమీదికి వచ్చాడు. ఫలానా అని తెలియని ఏదో సంతోషంతో ఆయన మనసు తేలిపోతూంది.

పోస్టాఫీసుదాకా నడిచిపోలేననుకుని, బస్సుస్టాపులో నిల్చున్నాడు సిటీబస్‌కోసం. బస్సు రాలేదు. జనంనిండుగా పోగయ్యారు. . . తరవాత చాలాసేపటికి బస్సు వచ్చింది. ఒకరినొకరు తోసుకుంటూ ఎక్కారు కొంత మంది. వాళ్లతోబాటుగా అలాగే తోసుకుని ఎక్కబోయాడు జానకిరామయ్యపంతులు. ఒక కాలు నేలమీద, మరో కాలు పుట్‌బోర్డుమీద. ముందూ వెనకా తోస్తున్న జనం. జవసత్త్వాలుక్షీణించినశరీరం... ఎక్కేవాళ్లను, దిగేవాళ్లను పట్టించుకోని కండక్టరో క్లీనరో 'రైట్' అన్నాడు. ఉన్నట్టుండి బస్సు కదిలింది. పది గజాలు పరిగెత్తి, మళ్లీ చప్పుడు చేస్తూ హఠాత్తుగా ఆగిపోయింది. . . అంతలోనే చుట్టుపక్కల జనం "ఎవరూ? ఏమిటి?" అంటూ చుట్టూ మూగారు. పోస్టు చేయబడని ఉత్తరంతో జానకిరామయ్య ఎడమచేయి దుమ్ములో పడిఉంది. జీవితకాలమంతా కృషిచేసి, నమ్ముకున్న వాళ్లను ఆదుకున్న కుడిచేయి మరోవైపు ధూళిలో పడిఉంది. బ్రతికున్నన్నాళ్ళూ ఆశలు నింపుకున్న కళ్లు తెరుచుకునే ఉన్నాయి. ఆ జనం మధ్యలో నుంచి ఎవరో ఒక గుడ్డ తెచ్చి కప్పారు. . .

దూరంగా పిడికెడు పిట్ట ఏదో మేఘాలలో ఎగిరిపోతూంది. ★

# అక్కినేని సాహిత్య బహుమతులు

ఏటా ప్రచురితమవుతున్న నవల, కథ, నాటకం, నాటిక అనే సాహిత్య విభాగాలలో ఉత్తమమైనవానికి ఒక్కొక్క విభాగంలోను సువర్ణ పతకం ఒకటి, రజత పతకం ఒకటి బహూకరించ దలచుకున్నట్టు శ్రీ అక్కినేని నాగేశ్వరరావు ప్రకటించిన విషయం పాఠకులకు తెలుసు.

ఆ ప్రణాళిక క్రింద 1969 లో వచ్చిన నవల మొదలైనవానిలో ఈ క్రిందివానికి బహుమతులను ఇవ్వవలెనని అందుకై నియమించిన కమిటీ నిర్ణయించింది.

## నవలలు

మొదటి బహుమతి : బంగారు పతకం
శ్రీ పోరంకి దక్షిణామూర్తి
— 'ముత్యాల పందిరి'

రెండవ బహుమతి : రజత పతకం
శ్రీ ఎస్. ఆర్. నంది
— 'నైమిశారణ్యం'

## నాటకాలు

మొదటి బహుమతి: బంగారు పతకం
శ్రీ ఆర్. వి. ఎస్. రామస్వామి
— 'సుడిగాలి'

రెండవ బహుమతి: రజత పతకం
శ్రీ గొల్లపూడి మారుతీరావు
— 'కరుణించని దేవతలు'

## నాటికలు

మొదటి బహుమతి: బంగారు పతకం
శ్రీ రావుల తాతారావు
— 'రిక్రియేషన్ క్లబ్'

రెండవ బహుమతి: రజత పతకం
శ్రీ మద్దినేని రాధాకృష్ణమూర్తి
— 'పరాజిత'

## చిన్న కథలు

మొదటి బహుమతి : బంగారు పతకం
శ్రీ నందుల వేంకటేశ్వరరావు
— 'విరిగిన అలలు'

రెండవ బహుమతి: రజత పతకం
శ్రీమతి ఆర్. వసుంధర
— 'వేషం'

( భారతి— డిసెంబరు 1969. )

వీనిలో బంగారు పతకం పొందిన నవల 'ముత్యాల పందిరి', అలాగే బంగారు పతకం పొందిన కథ 'విరిగిన అలలు' ఆంధ్రప్రభ సచిత్ర వారపత్రికలో తొలిసారి ప్రకటితమైనవని తెల్పుటకు ఆనందిస్తున్నాము.